సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 16 । అక్టోబర్ । 2025



ఎన్నాళ్లీ ఎదురుచూపులు

దివ్యాంగులు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. అర్హతలు ఉన్నా పింఛన్ అందుకోలేకపోతున్నారు. - 10లో



తల్లి లేదని తల్లడిల్లి

తల్లి లేదని తల్లడిల్లి ఓ బాలిక ప్రాణం తీసుకుంది. నంచాంలో ఘటన జరిగింది. - 10లో

శ్రీముఖలింగంలో గౌరమ్మ అనుపు ఉత్సవం

జలుమూరు: శ్రీముఖలింగంలో గౌరమ్మ, నందెన్న నవరాత్రుల సందర్భంగా ఉత్సవ మూర్తులను చివరి రోజు బుధవారం వంశధార నదిలో నిమ్మనం చేశారు. దీనికి ముందు గణపతిపూజతో ప్రారంభించి గౌరమ్మకు ప్రత్యేక పూజలు, నందెన్నకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి తిరువీధి నిర్వహించగా భక్తులు అమ్మవారికి మంగళ హారుతులిచ్చారు.

న్యూస్‌రీల్

'డిసెంబర్ నాటికి ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పూర్తి'



ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ, ఇంజినీరింగ్ అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సందర్శించారు. ప్రభుత్వ శాఖలన్నీ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌లోనే ఉండాలన్నారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ అన్ని ఫ్లోర్లలోని గదులను క్షుణ్ణంగా పరిశీలించి జేసీతో చర్చించారు. బయట చిన్న షాప్స్ పెట్టుకునే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఎస్ఈని ఆదేశించారు. వెనుక వైపు పార్క్ లేదా ఆడుకునేందుకు వీలుగా చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఎస్ఈ పి.సత్యనారాయణ, ఆర్ అండ్ బి ఈఈ ఎ.తిరుపతిరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి జీఏ సూర్యనారాయణ, కాంట్రాక్టర్ శ్రీరాం పాల్గొన్నారు.

నవంబర్ 2న ఆదిత్యుని హంసనావికోత్సవం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ఇంద్రపుష్కరిణిలో నవంబర్ 2న హంస నావికోత్సవం (తెప్పోత్సవం) జరుగుతుందని ఆలయ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలియజేశారు. కార్తీక శుద్ధ ద్వాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు ఇంద్రపుష్కరిణిలో ప్రత్యేకమైన హంస వాహనంపై స్వామి వారి ఉత్సవమూర్తులు విహరించనున్నారని, ఈ మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయనున్నామని వివరించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ సూచనల మేరకు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని జరిగేలా అలాగే వేలాది మంది భక్తులు రానున్న దృష్ట్యా పక్కా ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. ముఖ్య ప్రజాప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో పుష్కరిణికి తూర్పు భాగంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ప్రత్యేక హంసవాహనం తయారీ కోసం టెండర్లు కూడా ఈ నెల 18న పిలుస్తున్నామని తెలిపారు.

కేసులు వేగంగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా జైళ్లలో ఉన్న ముద్దాయిల కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ మార్గదర్శకాల మేరకు అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ (యూఆర్‌టీసీ) సమావేశం బుధవారం స్థానిక జిల్లా కోర్టులో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ.. బెయిల్ మంజూరైనా విడుదల కానివారు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, మహిళా ముద్దాయిల కేసులను యూఆర్‌టీసీలో చర్చించి, వారికి బెయిల్‌పై త్వరితగతిన విడుదల చేయించాలన్నారు. జిల్లాలో క్రైమ్ రేటును తగ్గించేందుకు పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

జేజేఎం లక్ష్యాలు పూర్తి చేయాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జల జీవన్ మిషన్ (జేజేఎం) కింద చేపట్టిన పనులను, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 15, 2025 నాటి గణాంకాల ప్రకారం, జిల్లాలో మొత్తం 4,87,307 ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 2,29,649 కనెక్షన్లు పూర్తయ్యాయి. ఇంకా 2,57,658 కనెక్షన్లు పూర్తి చేయాల్సి ఉంది. పనుల పురోగతి సంతృప్తికరంగా ఉన్నప్పటికీ, మిగిలిన లక్ష్యాన్ని చేరుకోవడానికి మండలాల వారీగా కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ఆయన సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో 29 గ్రామాలు 'హర్ ఘర్ జల్' డిక్లరేషన్ సాధించాయి. డిసెంబర్ 2025 నాటికి మరింత మందికి తాగునీరు అందించే లక్ష్యంతో నవంబర్ నుంచి మార్చి 2026 వరకు మరో 178 గ్రామాలను డిక్లేర్ చేయడానికి లక్ష్యం పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు.

పక్కచిత్రంలో నకిలీ మద్యంకు వ్యతిరేకంగా పలాస-కాశీబుగ్గలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మహిళలు నిరసన ర్యాలీ చేస్తుండగా దూసుకొస్తున్న మహిళలను రోప్‌తో పోలీసులు అడ్డుకుంటున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త పైల వేణుగోపాల్‌రెడ్డిని పిలిచి, రోప్ పట్టుకోమని చెప్పి, ఎలా గట్టిగా పట్టుకోవాలో భుజం తట్టి కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ చెప్పారు. దానికి సంబంధించిన విజువల్స్ స్పష్టంగా ఉన్నాయి. పోలీసుల సూచనలు పాటించి, తోపులాట జరగకుండా నివారించిన వేణుగోపాల్‌రెడ్డిని అభినందించాల్సింది పోయి ఆయనపైనే అక్రమ కేసు పెట్టి, నిర్బంధించారు. మహిళా పోలీసు సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించారని కేసు పెట్టి, హైడ్రామాకు తెరలేపారు.



రెడ్‌బుక్ రాజ్యంలో ఖాకీ మార్క్ కుట్రలు!

- రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం అక్రమ కేసులు, అరెస్టులు
- మహిళా హోంగార్డుపై అనుచితంగా ప్రవర్తించారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై తప్పుడు కేసు
- ఫిర్యాదు చేయాలని మహిళా హోంగార్డుపై అధికారుల ఒత్తిడి
- ఆమె అంగీకరించకపోవడంతో మహిళా కానిస్టేబుల్‌తో ఫిర్యాదు ?
- ప్రోత్సహించినట్టుగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై కూడా కేసు నమోదు





ఇదే పోలీసు అధికారులు నిరసన ర్యాలీలో పాల్గొన్న మహిళలు, పోలీసు సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించారు. రోప్ పట్టుకున్న సమయంలో ర్యాలీని నిలువరిస్తుండగా ఓ ఘటన కూడా చోటు చేసుకుంది. అసభ్యకరంగా కనిపిస్తున్న విజువల్స్ కూడా ఉన్నాయి. కానీ సీఐ సూర్యనారాయణ మాత్రం తోపులాట జరగకుండా నిలువరించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై అక్రమ కేసు బనాయించారు. ఇదంతా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రోద్బలంతో జరిగిందని ఆయనపైన కేసు నమోదు చేశారు. ఇందులో హత్యాయత్నం సెక్షన్ కూడా పెట్టారు.



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పలాసలో పోలీసులు హైడ్రామా నడిపారు. మహిళా హోంగార్డులతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పైల వేణుగోపాల్‌రెడ్డి అనుచితంగా ప్రవర్తించారని వాదన తెరపైకి తెచ్చిన పోలీసు అధికారులు నిన్నంతా ఒక మహిళా హోంగార్డుతో ఫిర్యాదు చేయించేందుకు తీవ్రంగా యత్నించారు. కానీ ఆమె ఎంతకీ ఒప్పుకోలేదు. రోజంతా ఒత్తిడి చేసినా ఫిర్యాదు చేసేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో అదే రోజు డ్యూటీలో ఉన్న మరో మహిళా కానిస్టేబుల్ చేత ఫిర్యాదు చేయించారన్న ఆరోపణలు ఉన్నాయి.

రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగమే..

పలాస నియోజకవర్గంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని సక్సెస్‌ఫుల్‌గా అమలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై పథకం ప్రకారం కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారు. అందుకు పోలీసు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. పలాస నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై వరుస పెట్టి కేసులు పెడుతున్నారు. ఏదో ఒక ఘటనలో ఇరికించి జైలుకు పంపించాలని చూస్తున్నారు. అందులో భాగంగా కుట్రలు పన్నుతున్నారు. తాజాగా కల్తీ మద్యంకు వ్యతిరేకంగా జరిగిన నిరసన ర్యాలీ చేపట్టినందుకు న్యూసెన్స్ కింద 23 మందిపై కేసు పెట్టారు. ఆ తర్వాత ర్యాలీలో మహిళా పోలీసు సిబ్బందితో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పైల వేణుగోపాల్‌రెడ్డి అనుచితంగా ప్రవర్తించారని, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రోద్బలంతో ఇదంతా చేశారని ఆయనపై కేసు పెట్టారు. మంగళవారం రాత్రి వేణుగోపాల్‌రెడ్డిని ఎందుకు అక్రమ అరెస్టు చేశారని డిమాండ్ చేసేందుకు పోలీసు స్టేషన్‌కు వచ్చి, బైఠాయించిన వారిపై కూడా కేసులు పెట్టారు. ఈ ఘటనలో 15 మందిపై కేసు పెట్టినట్టు సమాచారం. పలాసలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని ప్రజాస్వామ్యవాదులు అంటున్నారు. పచ్చనేతలు పథక రచన చేస్తే.. అధికారులు కుట్రలు అమలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.



కోర్టులో హాజరు పరిచేందుకు పైల వేణుగోపాల్‌రెడ్డిని తీసుకెళ్తున్న దృశ్యం

నిరసన ర్యాలీ చేస్తే.. హత్యాయత్నం కేసులు

ఈ మొత్తం ఘటన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రోద్బలంతో జరిగిందని ఆయనతో పాటు మరో 14 మందిపై కేసులు పెట్టారు. 132,74,79, ఆర్/డబ్ల్యూ 3(5), 109(1), 49 బీఎన్ఎస్ సెక్షన్లు పెట్టి కేసు నమోదు చేశారు. దీంట్లో మంగళవారం నిర్బంధంలోకి తీసుకున్న పైల వేణుగోపాల్‌రెడ్డి అనే కార్యకర్తను అరెస్టు చూపించి, బుధవారం కోర్టులో ప్రవేశ పెట్టారు. మిగతా వారిని అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇదిలా ఉండగా, ర్యాలీ జరిగిన రోజు న్యూసెన్స్ కింద 23మందిపై కేసు పెట్టారు. పైల వేణుగోపాల్‌రెడ్డిని ఎందుకు అరెస్టు చేశారని పోలీసు స్టేషన్‌లో డిమాండ్ చేసినందుకు, బైఠాయించినందుకు 15మందిపైన కేసు పెట్టారు.

పోలీసుల తీరు సరికాదు

- న్యాయపోరాటం చేస్తాం
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారని, పలాస నియోజకవర్గంలో మరింత ఎక్కువగా పోలీసు అధికారులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆరోపించారు. తప్పకుండా న్యాయపరమైన పోరాటం చేస్తామన్నారు. టీడీపీ నేతలు చెప్పినట్టు ఆడుతున్న అధికారులపై తప్పకుండా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త సంప్రదాయాన్ని తీసుకొచ్చారని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై కూడా అక్రమ కేసు పెట్టడం దారుణమన్నారు. ర్యాలీ చేస్తే తప్పుడు కేసులు పెట్టడమేంటని ప్రశ్నించారు. తప్పుడు ఫిర్యాదులు చేయించి, హత్యాయత్నం కేసులు కూడా పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. కేసు లు ఎదుర్కొంటున్న వారికి, పోలీసుల వేధింపులకు గురవుతున్న వారికి వైఎస్సార్‌సీపీ పార్టీ అండగా నిలుస్తుందని కన్నబాబు భరోసానిచ్చారు.

ప్రజా వ్యతిరేక చర్య



నిరసన తెలిపితే హత్యాయత్నం కేసులు పెడతారా? ఇదెక్కడి సంప్రదాయం. పోలీసులు వైఖరి దారుణంగా ఉంది. టీడీపీ నాయకులు చెప్పినట్టు గానడుస్తున్నారు. తప్పుడుకేసులు సరికాదు. పోలీసు అధికారులు ఇబ్బందులు పడతారు. తప్పుడు ఫిర్యాదులు, తప్పుడు మార్గాలు ఎంచుకుంటే తగిన మూల్యం చెల్లించుకుంటారు. –తమ్మినేని సీతారాం, మాజీ స్పీకర్, పార్టీ పార్లమెంట్ సమన్వయ కర్త

సాక్షిపై వేధింపుల పర్వం

- నిజాలు రాస్తుంటే తట్టుకోలేకపోతున్న కూటమి ప్రభుత్వం
- కేసులు, బెదిరింపులతో అణగదొక్కే యత్నం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ప్రజా సమస్యలతో పాటు అధికార పార్టీ నేతల అవినీతి, అక్రమాలను వెలుగులోకి తెచ్చే విధంగా నిజాలు రాస్తే కూటమి ప్రభుత్వం 'సాక్షి' పత్రికపై కక్ష సాధింపులకు దిగుతోంది. కల్తీ మద్యం, లిక్కర్ మాఫియా, ఇసుక దోపిడీ, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, అమరావతిలో అక్రమాలు, జిల్లాల వారీగా నాయకులు అవినీతి దందాలపై వార్తలు రాస్తుంటే తట్టుకోలేకపోతోంది. 'సాక్షి' పత్రికను, యాజమాన్యాన్ని, సిబ్బందిని టార్గెట్ చేసుకుని వేధింపులకు దిగుతోంది. అవినీతి అక్రమాలు, ప్రజా సమస్యలపై వస్తున్న వార్తలను జీర్ణించుకోలేక ఏకంగా కేసులు కూడా పెడుతోంది. హైదరాబాద్‌లో ఉన్న ప్రధాన కార్యాలయం నుంచి శ్రీకాకుళంలో ఉన్న ఎచ్చెర్ల యూనిట్ కార్యాలయం వరకు దాడులకు దిగిన సందర్భాలు ఉన్నాయి. ఇక, సిబ్బందికి బెదిరింపులైతే చెప్పనక్కర్లేదు. మీడియా సమావేశాల వేదికగా దూషణలకు దిగడం, బెదిరించడం చేస్తున్నారు.

ఆ మధ్య 'సాక్షి' లో తమకు వ్యతిరేకంగా కథనాలు వచ్చాయని ఎచ్చెర్లలోని 'సాక్షి' కార్యాలయంపై టీడీపీ గూండాలు దాడికి దిగారు. రౌడీల్లా బీభత్సం సృష్టించారు. 'సాక్షి' కార్యాలయం ఆస్తులు ధ్వంసం చేశారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు బావ మెండ దాసునాయుడు తదితరులు సుమారు మూడు గంటల పాటు విధ్వంసానికి పాల్పడ్డారు. 'సాక్షి' యూనిట్ కార్యాలయం నేమ్ బోర్డును పీకేసి తగలబెట్టారు. ప్రహరీపై నుంచి లోపలికి దూకి కార్యాలయం లోపలకు వెళ్లి గలాటా సృష్టించారు. పోలీసుల ఎదుటే ధ్వంస రచన చేశారు.



ఎచ్చెర్లలోని సాక్షి కార్యాలయంపై దౌర్జన్య కాండ(ఫైల్)



- కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు జరిగిన అన్యాయంపై వార్తలు ఇచ్చినందుకు ఆమదాలవలస ఎమ్మెల్యే 'సాక్షి' టీవీ రిపోర్టర్‌ను దుర్భాషలాడారు.
- టీడీపీ నాయకుల అక్రమాలపై 'సాక్షి' టీవీలో కథనాలు వచ్చాయని 'సాక్షి' దినపత్రికను కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరులో దహనం చేశారు. అక్కడొక నాయకురాలు ప్రెస్‌మీట్‌లో బెదిరించే ధోరణిలో మాట్లాడారు.
- సంతబొమ్మాళి మండలం ఆకాశలక్కవరంలో యూరియా కోసం గొడవ జరిగితే దానిపై 'సాక్షి'లో కథనం ప్రచురించారన్న అక్కసుతో నౌపడ పోలీసు స్టేషన్ ఎదుట టీడీపీ కార్యకర్తలు 'సాక్షి' దినపత్రికను దగ్ధం చేశారు.
- ప్రెస్‌మీట్లలో 'సాక్షి' విలేకర్లపైన, పత్రికపైన ఇష్టారీతిన మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి.
- ఫోన్‌లు చేసి బెదిరించే విధంగా మాట్లాడిన దాఖలాలు ఉన్నాయి.
- జిల్లాలోని పోలాకి రిపోర్టర్ షణ్ముఖరావు వ్యతిరేకంగా ఉన్నారని ఆయన ఎరువుల షాపులపై కూటమి ప్రభుత్వం రాగానే సోదాలు నిర్వహించింది. అలాగే ఆయన తల్లి పింఛను నిలిపివేసింది. తర్వాత తప్పిదం తెలుసుకుని ఇచ్చింది.
- ఇసుక దోపిడీపై వచ్చిన వార్తల విషయంలో కూడా 'సాక్షి' సిబ్బందికి బెదిరింపులు వచ్చాయి.

అధికారం శాశ్వతం కాదు



కూటమి ప్రభుత్వం పాలనలో తప్పిదాలు, వ్యవస్థలో లోపాలను నిర్భయంగా, నిజాయితీగా రాస్తున్న 'సాక్షి' మీడియాపైన కూటమి ప్రభుత్వం పోలీసులను ఉసి గొల్పి, దాడులు చేయించడం అనేది అప్రజాస్వామికం. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదు. జర్నలిజమే శాశ్వతం. ప్రభుత్వం మారిన తర్వాత ఇబ్బంది పడేది పోలీసులే. చేసిన తప్పులకు కచ్చితంగా సమాధానం చెప్పుకోవాలి. – చిగురువలస జగదీష్, జిల్లా అధ్యక్షుడు, ఏపీయూడబ్ల్యూజే

పత్రికలు, పాత్రికేయులపై అక్రమ కేసులు సరికాదు



నకిలీ మద్యంపై వార్తలు రాసే పత్రికలు, పాత్రికేయులపై అక్రమ కేసులు పెట్టి బెదిరించడం సరికాదు. ప్రజలకు, ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టయిన పత్రికా రంగంపై కక్ష సాధింపు చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు. నా 40 ఏళ్ల రాజకీయ జీవితం, 30 ఏళ్ల ప్రెస్ ఫొటోగ్రాఫర్ జీవితంలో ఎప్పుడూ ఇలాంటి సంఘటనలు చూడలేదు. – ఎం.ఏ బేగ్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు

డీజే సౌండ్‌కు కూలిన పురాతన భవనం పోర్టికో



కూలిన పురాతన భవనం పోర్టికో

- గౌరమ్మ అనుపు ఉత్సవాల్లో ప్రమాదం
- ఆరుగురికి గాయాలు.. ముగ్గురి పరిస్థితి విషమం

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధి భవానీపురం వీధిలో బుధవారం రాత్రి ఘోర ప్రమాదం సంభవించింది. గౌరమ్మ అనుపు ఉత్సవాల్లో భాగంగా స్థానికులు ఏర్పాటు చేసిన డీజే సౌండ్‌కు అదే వీధిలో ఉన్న పురాతన భవనం పోర్టికో ఒక్క సారిగా కుప్పకూలింది. దీని కింద ఉండిపోయిన ఆరుగురు గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. సంఘటన జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను శిథిలాల నుంచి బయటకు తీసి ఆస్పత్రికి పంపించారు. బండి సంతోష్, బండి పూర్ణ, బండి బాలకృష్ణ, పన్నీరు చిరంజీవి, అగనంపోలు అమృత, అగనంపోలు రాధ గాయపడ్డారు. పడిపోయిన ఇంటిలో పెయింటర్ కృష్ణ నివసిస్తుండగా ఆయన భార్య, కుమార్తెలకు కూడా గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ పరిశీలించి క్షతగాత్రుల్లో ఇద్దరిని శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. స్థానిక అగ్నిమాపక సిబ్బంది వచ్చి శిథిలాలను పరిశీలించారు. ఎంపీటీసీ నేతింటి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో క్షతగాత్రులను వివిధ ఆస్పత్రులకు తరలించారు. నరసన్నపేటలో నలుగురు చికిత్స పొందుతున్నారు.





క్షతగాత్రులకు చికిత్స

బుల్లెట్ బైకులే టార్గెట్

- ముగ్గురు బైక్ దొంగల అరెస్టు
- రూ.14 లక్షలు విలువ చేసే ఏడు బుల్లెట్ బైక్‌లు చోరీ
- వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

శ్రీకాకుళం రూరల్: జల్సాలకు అలవాటు పడ్డారు. సులువుగా డబ్బు సంపాదించాలని మార్గాలు వెతికారు. బైక్ హ్యాండిల్ లాక్‌లను అన్‌లాక్ చేయడం నేర్చుకున్నారు. బైక్‌లను దొంగిలించి తక్కువ ధరకు అమ్మడం అలవాటు చేసుకున్నారు. చివరికి పోలీసుల చేతికి చిక్కారు. బుధవారం రూరల్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు కేసు వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం రూరల్ పరిసర ప్రాంతంలో 5 బుల్లెట్ బైక్‌లు, ఆమదాలవలస ప్రాంతంలో 2 బుల్లెట్ బైక్‌లు పోయినట్లు రూరల్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. రెండు రోజుల కిందట రాగోలు దూసి ప్రాంతంలో రూరల్ ఎస్ఐ రాము వాహనాలు తనిఖీలు చేస్తుండగా రెండు బుల్లెట్లపై వస్తున్న ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా వ్యవహరించడంతో ఆరా తీశామని, అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు.

ఖరీదైన వాహనాలే ఆదాయ వనరులు..

బుల్లెట్ దొంగతనాలకు పాల్పడిన ఎ-1 దండు రిషివర్ధన్ స్వస్థలం విశాఖపట్నం. విశాఖ కమిషనరేట్‌లో పీఎం పాలెం పోలీస్‌స్టేషన్‌లో ఓ వివాహిత హత్య కేసులో ప్రధాన నిందితుడు. పార్వతీపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఒక చీటింగ్ కేసులో ముద్దాయిగా ఉన్నాడు. ఎ-2 రాయిపల్లి వినోద్ స్వస్థలం సాలూరు కాగా.. అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఐదు సారా కేసులు, సాలూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌తో పాటు గంట్యాడ పోలీస్‌స్టేషన్‌లో ఒక డెకాయిటీ కేసు, అలాగే పార్వతీపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసులతో పాటు ఏడు కేసులు నమోదై ఉన్నాయి. ఇతనిపై పార్వతీపురం జిల్లా కలెక్టర్ పీడీ యాక్ట్ కూడా ఓపెన్ చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

జైలులో పరిచయం..

దండు రిషివర్ధన్, రాయిపల్లి వినోద్‌లు ఇద్దరూ జైలులో ఒకరికి ఒకరు పరిచయమయ్యారు. విలువైన బైక్‌లు దొంగతనం చేసి నంబర్ మారిస్తే ఎవరూ పట్టుకోలేరని ప్లాన్లు గీశారు. గడిచిన మూడు నెలలుగా ఏడు బైక్‌లు దొంగిలించారు. దొంగిలించిన బైక్‌లను మూడో నిందితుడు, బైక్ మెకానిక్ కొత్తూరుకు చెందిన చిట్టి సంతోష్ సెకండ్ హ్యాండ్ బైక్ షోరూమ్ నిర్వాహకుడి సాయంతో విక్రయించారు. వీరి వద్ద నుంచి ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కేసులో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లు బాబురావు, నారాయణరావు, సురేష్, కృష్ణలకు ఎస్పీ మహేశ్వరరెడ్డి చేతులమీదుగా ప్రశంసాపత్రాలను అందించారు.

దివ్వెమైన ప్రతిభ

- ప్రమిదలు తయారు చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు
- బెహరా మనోవికాస కేంద్రంలో ప్రదర్శన



శ్రీకాకుళం కల్చరల్: దీపావళి సమీపిస్తోంది. ప్రతి ఇంటా వెలుగులు నింపేందుకు ప్రమిదలు తయారవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని బెహరా మనోవికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులు అందమైన దివ్వెలు తయారు చేసి విక్రయిస్తున్నారు. వినూత్నమైన ఆలోచనలతో ఎవరికీ తీసిపోని విధంగా ఈ ప్రమిదలు తయారు చేస్తున్నారు. పండగ సందర్భంగా వీటిని చక్కటి రంగులు వేసి విక్రయానికి సిద్ధం చేస్తున్నారు.



ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన రంగురంగుల ప్రమిదలు



ప్రమిదలకు రంగులు దిద్దుతున్న దివ్యాంగులు

ఎగ్జిబిషన్ ఏర్పాటు

మల్టీకలర్‌లో తయారు చేస్తున్న ఈ ప్రమిదలతో హౌసింగ్ బోర్డులో ఉన్న బెహరా మనోవికాస కేంద్రంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ప్రమిదలను 74 మంది మానసిక దివ్యాంగులు కలిసి తీర్చి దిద్దుతున్నారు. తన వంతుగా నిర్వాహకురాలు శ్యామల వారిని ప్రోత్సహిస్తున్నారు. ఈ సారి మల్టీకలర్స్‌తో తీర్చిదిద్దుతున్నారు. వీటిలో ఒక రకం ధర 12 ప్రమిదలు రూ.60లు, అలాగే మరో రకం 12 ప్రమిదలు రూ.100లు అమ్మకానికి ఉన్నాయి.

ప్రోత్సహించండి



దివ్యాంగులు తయారు చేస్తున్న మల్టీకలర్ ప్రమిదలను కొనుగోలు చేసి అందరూ సహకరించాలి. ఎవరైనా కొనుగోలు చేయాలంటే 9848868960 ను సంప్రదించాలి. – శ్యామల, నిర్వాహకురాలు, బెహరా మనోవికాస కేంద్రం, శ్రీకాకుళం

క్లుప్తంగా

పుస్తెలతాడు చోరీ



ఘటన జరిగిన స్థలంలో గుమిగూడిన జనం

సంతబొమ్మాళి: బోరుభద్ర గ్రామంలో మార్పు అప్పన్నమ్మకు చెందిన రెండు తులాల బంగారు పుస్తెలతాడు చోరీకి గురైనట్లు సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు. బుధవారం ఉదయం అప్పన్నమ్మ తన కన్నవారిల్లు ఉన్న నగిరిపెంట గ్రామానికి వెళ్లింది. తిరిగి బోరుభద్ర వచ్చేందుకు నగిరిపెంట జంక్షన్ వద్ద బస్సు కోసం వేచి ఉండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలో పుస్తెలతాడు తెంచుకుని పారిపోయారు. బాధితురాలు కేకలు వేసినా చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఫలితం లేకపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ప్రజల్లో న్యాయ విజ్ఞానం విస్తృతంగా వ్యాప్తి చెందడానికి, చట్టాలపై అవగాహన పెంచడానికి పారా లీగల్ వలంటీర్లకు సమగ్ర శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పారా లీగల్ వలంటీర్లకు మ జిల్లా న్యాయ సేవా సదన్‌లో నాలుగు రోజుల ప్రత్యేక శిక్షణ బుధవారం ప్రారంభించారు. వివిధ పథకాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరి బాబు, న్యాయవాదులు అన్నెపు భువనేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



సంతోష్ మృతదేహం

బూర్జ: ఆమదాలవలస–పాలకొండ ప్రధాన రహదారిలో నీలాదేవిపురం మలుపు వద్ద ద్విచక్ర వాహనం ముందుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి గోతులో పడటంతో యువకుడు దుర్మరణం చెందాడు. మృతుడు విజయనగరం జిల్లా గరివిడి మండలం చేరిపేటకు చెందిన కె.సంతోష్‌గా గుర్తించారు. అదే బైక్‌పై వెనుక కూర్చున్న నమ్మి కనకరాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వీరు బుధవారం సాయంత్రం పార్వతీపురంలో ఓ శుభకార్యం ఫొటోషూట్ తీసేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. హెచ్‌సీ ఉమామహేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

సిక్కోలు పుస్తక మహోత్సవం లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో నవంబర్ 11 నుంచి 20 వరకు జరగనున్న సిక్కోలు పుస్తక మహోత్సవం సాహిత్య సాంస్కృతిక వైజ్ఞానిక సంబరాలు విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆకాంక్షించారు. ఈ మేరకు తన చాంబర్‌లో సిక్కోలు పుస్తక మహోత్సవం లోగోను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహోత్సవం కన్వీనర్ కె.శ్రీనివాసు, సాంస్కృతిక వైజ్ఞానిక కన్వీనర్లు పి.సుధాకరరావు, గొంటి గిరిధర్, కామినాయుడు, దొంతం పార్వతీశం, కె.కూర్మారావు, పి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్‌సంబరాలు పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న చెకుముకి సైన్స్ సంబరాలకు మంచి ఆదరణ లభిస్తోందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ అన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు రూపొందించిన 8వ తరగతి ఎన్ఎంఎంఎస్ పరీక్షల స్టడీ మెటీరియల్, చెకుముకి సైన్స్ పోస్టర్‌ను జేసీ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్, ఉపాధ్యక్షుడు పి.కూర్మారావు, జిల్లా కార్యదర్శి పి.గోవిందరావు, జిల్లా ఆడిట్ కన్వీనర్ బి.ఉమామహేశ్వరరావు, డి.పార్వతీశం పాల్గొన్నారు.

పురపాలికల్లో..
పడకేసిన పారిశుద్ధ్యం

- పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- పలుచోట్ల తూతూమంత్రంగా చెత్త సేకరణ
- పట్టణవాసులకు తప్పనిపాట్లు

పురపాలక సంస్థల పరిధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. శ్రీకాకుళం కార్పొరేషన్‌తో పాటు ఇచ్ఛాపురం, పలాస, ఆమదాలవలస మున్సిపాలిటీల్లో చెత్తాచెదారాలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. రోజుల తరబడి ఇదే పరిస్థితి ఉండటంతో కుక్కలు, పశువులు, పందులు చేరి పరిసరాలను చిందరవందరగా మార్చుతున్నాయి. చెత్త సేకరణకు సంబంధించి డంపర్ బిన్లు పాడైపోవడంతో నిర్వహణ కష్టంగా మారిందని సిబ్బంది చెబుతుండగా.. దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు, అటువైపుగా వెళ్లే వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పురపాలక సంస్థల పరిధిలో పారిశుద్ధ్యంపై 'సాక్షి' ఫోకస్..

శ్రీకాకుళం కార్పొరేషన్‌లో..



మాధవమోటార్స్ జంక్షన్ వద్ద నడిరోడ్డుపై ఉన్న డంపర్‌బిన్ వద్ద కుక్కలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

నగరంలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోతుండటంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. కార్పొరేషన్ పరిధిలో విలీన పంచాయతీలతో కలిపి 50 డివిజన్లు ఉన్నాయి. అందులో 1.85లక్షలు మంది జనాభా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ వాహనాలు 50 ఉండేవి. వీటికి అదనంగా రెండు వాహనాలు అందుబాటులో ఉండేవి. ప్రతిరోజూ తెల్లవారుజామున 5గంటలకే ఇంటి ముంగిటకు వాహనాలు వచ్చి చెత్త సేకరించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. వాహనాలు 40 కంటే తక్కువగానే ఉన్నాయి. అందులో కొన్ని రిపేర్లకు గురికావడం, డ్రైవర్లు సరిగా లేకపోవడం, వాహనాలకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వంటి ఇబ్బందు వల్ల పారిశుద్ధ్యం పడకేసింది. తడి చెత్తకు వేరేగా...పొడి చెత్తకు వేరేగా డస్ట్‌బిన్‌లు కార్పొరేషన్ సరఫరా చేసేది. ఇప్పుడా పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర అంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు ఫోటోలకు ఫోజులిచ్చి మమా అనిపించేస్తున్నారు తప్ప పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవడం లేదని నగర వాసులు మండిపడుతున్నారు.

ఆమదాలవలస మున్సిపాలిటీలో..



ఆమదాలవలస లక్ష్మినగర్ వీధి శివారులో చెత్తకుప్ప

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని చింతాడ, మన్నయ్యపేట, సప్తపురాలు, లక్ష్మిడిపేట, వెంకయ్యపేట, తిమ్మాపురం, గేదెలవానిపేట, ఊసవానిపేట, పూజారిపేట, లక్ష్మినగర్ వీధి తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపిస్తోంది. దోమలు, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పూజారిపేట నుయ్యివీధి శివారులో మురికి కూపం వల్ల దుర్వాసన భరించలేకపోతున్నామని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇక కుక్కల సంగతి సరేసరి. రోడ్డుపైకి రావాలంటేనే జనం హడలిపోతున్నారు.



శ్రీకాకుళంలోని విశాఖ-బి కాలనీలో సాయిబాబా గుడి సమీపంలో పేరుకుపోయిన చెత్త

భరించలేం..



రోడ్డుపై పేరుకుపోతున్న చెత్తకుప్పలతో బయటకు రావాలంటే భయమేస్తోంది. ఓవైపు తీవ్ర దుర్వాసన, మరోవైపు కుక్కల దాడులు, దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయి. మా కాలనీలో ఎప్పుడూ నరకమే. – టి.ధనుంజయరావు, డీసీసీబీ కాలనీ, శ్రీకాకుళం

రిపేర్లు వాస్తవమే..



నగరంలో చెత్తకుప్పలు లేకుండా చర్యలు చేపడతాం. డంపర్ బిన్లు రిపేర్లు ఉన్న మాట వాస్తవమే. వాటిని బాగుచేయించి ఇబ్బంది లేకుండా చేస్తాం. ఎక్కడ చెత్తకుప్పలు ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే వెంటనే క్లియర్ చేయిస్తాం. – పి.వి.వి.డి ప్రసాదరావు, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో 23 వార్డుల్లో సుమారు 50వేల మంది జనాభా ఉంటున్నారు. రోజూ సరాసరి 18 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పన్నమవుతుంది. డంపింగ్ పాయింట్ వద్ద మాత్రమే సిబ్బంది చెత్త తొలగిస్తుంటారు. వీధుల్లో కొన్ని సార్లు చెత్త సేకరణ విస్మరిస్తుంటారు. బెల్లుపడ కాలనీ, కండ్రవీధి, రత్తకన్న గ్రామాల్లో చెత్తకుప్పలు పేరుకుపోవడంతో పందులు, కుక్కలు, ఆవులు ఆ ప్రాంతాలను చిందరవందర చేసేస్తున్నాయి.



రత్తకన్నలో చెత్తకుప్ప వద్ద పశువుల సంచారం

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో..



అప్పయ్యదొర రోడ్డులో పేరుకుపోయిన చెత్త

పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో 31 వార్డులు ఉన్నాయి. సుమారు 65 వేల మంది జనాభా ఉన్నారు. రోజూ 20 టన్నుల వరకు చెత్త చేరుతుంటుంది. చాలాచోట్ల పారిశుద్ధ్య నిర్వహణ పడకేసింది. రోడ్లపై చెత్తకుప్పలు పేరుకుపోవడంతో స్థానికులతో పాటు వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. పారిశుద్ధ్య కార్మికులు రోజువారీ చెత్తను తొలగిస్తున్నా కొందరు రోడ్డుపైనే వ్యర్థాలను పారబోస్తుండటంతో దుర్వాసన వెలువడుతోంది.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు?



మంచానికే పరిమితం..

ఈ చిత్రంలో మంచానికే పరిమితమైన వృద్ధురాలి పేరు శిగిలిపల్లి ఆదిలక్ష్మి. టెక్కలి మండలం తలగాం గ్రామం. 2024 మార్చిలో ఈమె భర్త మరణించారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2024 జూన్‌లో ఈమెకు వితంతు పింఛన్ మంజూరైంది. అప్పటికే ఆమె మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో మంచానికే పరిమితమైంది. పింఛన్ మంజూరైనా ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారు.

- మంజూరుపత్రాలు ఇచ్చినా అందని పింఛన్
- ఆందోళనలో వితంతు పింఛన్ లబ్ధిదారులు

టెక్కలి: కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త పింఛన్లకు మోక్షం కలగడం లేదు. అన్ని రకాల అర్హతలు, ధ్రువపత్రాలు ఉన్నా పింఛన్లు అందక అర్హులు ఆవేదన చెందుతున్నారు. సాంకేతిక కారణాలు, ఉన్నతాధికారులపై నెపం నెట్టేస్తూ పంపిణీలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. కొన్నిచోట్ల పింఛన్లు మంజూరైనా వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నారనే కక్షతో లబ్ధిదారులకు పెన్షన్ అందజేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కక్షతో ఆపేశారు..



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు శిగిలిపల్లి తులసమ్మ. స్వగ్రామం టెక్కలి మండలం తలగాం. ఈమె భర్త 2024లో మరణించారు. జూన్‌లో వితంతు పింఛన్ మంజూరైంది. అయితే కుటుంబ సభ్యులు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నారనే కారణంగా మంజూరైన పింఛన్ డబ్బులు ఇవ్వకుండా అవస్థలకు గురి చేస్తున్నారు. ఇదే గ్రామంలో మానసిక పరిస్థితి సక్రమంగా లేని శిగిలిపల్లి ఆదిలక్ష్మి భర్త, తులసమ్మ భర్త ఇద్దరూ అన్నదమ్ములు. ఒకరు మార్చి నెలలో మరణిస్తే.. మరొకరు జనవరిలో మరణించారు. ఈ రెండు కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నాయనే కక్షతో పింఛన్లు ఇవ్వడం లేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు పరిహారం ఇప్పించాలని వినతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గాలులు, వరదలకు పాతపట్నం నియోజకవర్గంలో సుమారు 5250 ఎకరాల్లో వరి, ఇతర పంటలకు నష్టం వాటిల్లిందని, ఆ పంటలకు ప్రభుత్వం తరఫున పరిహారం ఇప్పటించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. అన్నదాత సుఖీభవ కింద రెండేళ్లకు రూ.40 వేలు బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు నష్టం

బూర్జ: పేదలకు, విద్యార్థులకు తీరని నష్టం కలిగించే ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రయివేటీకరణను తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ సమక్షంలో బూర్జ మండలం లక్కుపురం, అల్లెన, డొంకలపర్త గ్రామాల్లో బుధవారం కోటి సంతకాల మహోద్యమం, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ విద్య, వైద్యం పేదలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారని, ఆ గొప్ప ఆశయానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డొంకలపర్తలో సంతకాలు చేయిస్తున్న ధర్మాన కృష్ణదాస్, చింతాడ రవికుమార్


తల్లి లేదని తల్లడిల్లి..

- సంచాంలో బాలిక ఆత్మహత్య

రణస్థలం: తల్లి ఏడాది క్రితం చనిపోవడంతో చిన్న కుమార్తె మండల భాగ్య శ్రీ(14) మానసికంగా కుంగిపోయింది. నిత్యం తల్లినే తలుచుకుని తల్లడిల్లిపోయేది. ఈ క్రమంలో ఈ నెల 12న పురుగుల మందు తాగడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. జె.ఆర్.పురం పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంచాం గ్రామానికి చెందిన మండల రమణ పైడిభీమవరంలో డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అతని భార్య ఏడాది క్రితం చనిపోయింది. పెద్ద కుమార్తె హరిత రణస్థలంలో ఇంటర్మీడియట్ చదువుతోంది. చిన్న కుమార్తె భాగ్యశ్రీ విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కోనాడలో పిన్ని వద్ద ఉంటూ అక్కడే ఆర్టర్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. తల్లి చనిపోవడంతో మానసిక వేదనకు గురై పాఠశాలలో ఒకసారి చీమల మందు తాగి ఆత్మహత్యాప్రయత్నం చేసింది. ఈ క్రమంలో దసరా సెలవులకు సంచాంలోని తండ్రి దగ్గరకు వచ్చింది. ఈ నెల 12న తండ్రి డ్యూటీకి వెళ్లాక గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 14న అర్ధరాత్రి మృతి చెందింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

తపాలా ఉద్యోగుల నిరసన

శ్రీకాకుళం అర్బన్: కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఉద్యోగం నుంచి తొలగించిన తపాలా ఉద్యమ జాతీయ నాయకుడు మహాదేవయ్యను వెంటనే తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని తపాలా ఉద్యోగుల సంఘ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద జిల్లా నలుమూలల నుంచి దాదాపు 300 మంది పోస్టల్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నందికేశ్వరరావు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు గణపతి, పోస్టల్ ఉద్యమ జిల్లా నాయకులు యు.వి.రమణ, బాబురావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

నాచు పెంపకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మత్స్యశాఖ అధికారులు

ఎచ్చెర్ల : బుడగట్లపాలెం సముద్రతీరంలో కప్పాఫైకస్ జాతి సముద్ర నాచు పెంపకంపై స్థానిక మత్స్యకార స్వయం సహాయక సంఘాల మహిళలకు బుధవారం మత్స్యశాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికచేసి నాచు పెంపకం చేపడుతున్నట్లు మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు వై.సత్యనారాయణ తెలిపారు. 50 మంది మహిళలకు 10 మంది మత్స్యకారులు శిక్షణ పొందుతున్నారని చెప్పారు. నాచు కొనుగోలు చేసే బాధ్యత మత్స్యశాఖ తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, మత్స్యశాఖ ఎఫ్‌డీవో రవి, జీఎఫ్ ప్రతినిధి శామ్యూల్, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు చీకటి శ్రీరాములు, మహిళలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

పీపీపీ అంటే ప్రైవేటుపరం చేయడమే..

నరసన్నపేట: మెడికల్ కాలేజీలకు సంబంధించి పీపీపీ అంటే ప్రైవేటుపరం చేయడమేనని, కూటమి ప్రభుత్వం తీరును ప్రతీ ఒక్కరూ వ్యతిరేకించాలని మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. నరసన్నపేట మండలం మడపాంలో బుధవారం నిర్వహించిన రచ్చబండలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రయివేటు వ్యక్తులకు ఇచ్చి స్వప్రయోజనాలకు వాడుకోవాలని, కొందరికి కట్టబెట్టాలని చూస్తోంన్నారు. ఆ పార్టీలో కొన్నాళ్లు కొనసాగిన తనకు వారి పన్నాగం అంతా తెలుసునని వివరించారు. కల్తీ మద్యం వ్యవహారంపై తప్పు కప్పిపుచ్చుకోవడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ కింజరాపు సోదరులు వల్ల జిల్లాకు ఒరిగిందేమీ లేదన్నారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య మాట్లాడుతూ కూటమి పాలనలో జరుగుతున్న అన్యాయాలు, కార్యకర్తలు పడుతున్న బాధలు వివరించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మండలస్థాయిలో వివిధ అనుబంధ సంఘాలకు అధ్యక్షులుగా ఎంపికైన నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో మడపాం ఎంపీటీసీ రువ్వ వాసు, మడపాం, దేవాది సర్పంచ్‌లు రాపర్తి ఎరుకోడు, మంతిన రాము, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

మహిళలపై నేరాలు అరికట్టలేకపోతున్నాం

- ప్రజల అభిప్రాయం కూడా ఇలాగే ఉంది
- మహిళా పోలీసులతో ఎస్పీ మహేశ్వరరెడ్డి



హాజరైన మహిళా పోలీసులు



మహిళా పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : 'మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టలేకపోతున్నాం.. ప్రజల అభిప్రాయం అదే' అంటూ ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి కుండబద్దలుగొట్టారు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నట్లు ఆమదాలవలస మండలం కొర్లకోట సచివాలయ పరిధిలో 67 శాతం ప్రజలు ఐవీఆర్ఎస్‌లో ఓటింగ్ చేశారని, ఎచ్చెర్ల మండలం కుప్పిలి–2 సచివాలయ పరిధిలోనూ 60 శాతం మంది ఇలాగే చెప్పారని ఉదాహరణలతో సహా ఎస్పీ వెల్లడించారు. మహిళా పోలీ సులతో జిల్లా కేంద్రంలోని బృందావనం ఫంక్షన్ హాల్ వార్షిక సమావేశంలో బుధవారం సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. సమావేశం ప్రారంభంలో కొందరు సమస్యలు చెప్పడంతో ఆయన వాస్తవాలు బయటపెట్టారు. 'దాదాపు 800 మహిళా పోలీసుల్లో ఎంత మంది బాగా పనిచేస్తున్నారు..? ఎంతమంది సక్రమంగా లీవ్‌లు వాడుతున్నారు' అంటూ చురకలంటించారు. పనిచేసే పోలీసులందరికీ ఆయా సందర్భాల్లో అవార్డులు ఇస్తున్నామని, ఆఖరికి హోంగార్డులు కూడా అందుకుంటున్నారని, మీరు ఏ స్థానంలో ఉన్నారో ఆలోచించుకోవాలన్నారు. హోంగార్డుల నుంచి అడిషనల్ ఎస్పీల వరకు తన వద్ద ఫీడ్ ఉందని, వారి మంచి చెడు రెండూ తనకు తెలుసని, ఇక మీ మహిళా పోలీసులపై దృష్టిపెడతానని, మైండ్‌సెట్ మార్చుకోవాల్సిందే అంటూ హెచ్చరించారు.

జీరో వైలెన్సే లక్ష్యం..

రానున్నది స్థానిక సంస్థల ఎన్నికల సీజన్ అని, గ్రామాల్లో ట్రబుల్‌మాంగర్స్, షీటర్లు, రౌడీషీటర్లను గుర్తించాలని, ఎప్పుడో జరిగిన గొడవలను ఎన్నికల రోజు, ప్రచారాలు చేసే సమయంలో రాజేసే వారుంటారని అలాంటి లిస్టంతా నవంబర్ 15 కల్లా సిద్ధంగా ఉంచాలని మహిళా పోలీసులకు డెడ్‌లైన్ పెట్టారు. లాఅండ్‌ఆర్డర్ పోలీసులకు ఇప్పటికే అక్టోబర్ 15కల్లా లిస్ట్ సిద్ధం చేయమని చెప్పామన్నారు. ఎన్నికల్లో తన టార్గెట్ జీరో వైలెన్స్ అని స్పష్టం చేశారు. ఉమెన్‌హెల్ప్‌డెస్క్, శక్తియాప్, నారీ శక్తి వంటి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గతంలో కంటే క్రైమ్ రేట్ తగ్గిందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ డి.సత్యనారాయణ, టౌన్ డీఎస్పీ వివేకానంద పాల్గొన్నారు.

మద్యం నాణ్యత తనిఖీకి యాప్

శ్రీకాకుళం క్రైమ్ : దుకాణాల్లో కొనే మద్యం ప్రభుత్వం సరఫరా చేసినదా.. కాదా అని తెలుసుకోవడానికి, మద్యం నాణ్యతను తనిఖీ చేసుకునేందుకు ఎక్సైజ్ శాఖ 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' అనే మొబైల్ యాప్ ప్రవేశపెట్టిందని ఆ విభాగ అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు బుధవారం పేర్కొన్నారు. గూగుల్ ప్లేస్టోర్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, కన్జ్యూమర్ పోర్టల్ క్లిక్ చేస్తే క్యూఆర్ కోడ్ వస్తుందని, బాటిల్ మూతపై అతికించిన హీల్‌పై స్కాన్ చేయాలన్నారు. వెంటనే వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

సైకత జీఎస్టీ



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న జీఎస్టీ 2.0 అవగాహన కార్యక్రమాలో భాగంగా బుధవారం గార మండలం కె.మత్స్యలేశం బీచ్‌లో కళాకారుడు తరణి మిశ్రా «సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్» పేరిట సైకత శిల్పం వేశారు. కోకావారి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

– గార: